సంక్షేమ పథకాలతో ప్రతి ఇంటా ఆనందం

ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి

వాల్మీకిపురం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి సంక్షేమ పథకాలతో రాష్ట్రంలోని లక్షలాది కుటుంబాలలో వెలకట్టలేని ఆనందాన్ని నింపుతున్నాయని ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. శుక్రవారం పట్టణంలోని సచివాలయం 3 పరిధిలోని రామ్‌నగర్ కాలనీ, ఎన్టీఆర్ కాలనీలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా ఇంటింటికి వెళ్లి సమస్యలను అడిగి తెలుసుకొని, పరిష్కార సమస్యలను అక్కడిక్కడే పరిష్కరించారు. అనంతరం ఆయా కుటుంబాలు పొందిన లబ్ధి వివరాలతో కూడిన బుక్‌లెట్‌ను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చింతల మాట్లాడుతూ గత ప్రభుత్వం ఎన్నికల సమయంలో హామీలిచ్చి అధికారంలోకి వచ్చాక విస్మరించిందన్నారు. కానీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రజా సంకల్ప పాదయాత్ర, ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి ఒక్క హామీని అమలు చేశారని గుర్తు చేశారు. నిరుపేదలకు కార్పొరేట్ వైద్యం అందించాలనే లక్ష్యంతో వైఎస్ జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి ఆరోగ్యశ్రీ పథకానికి పూర్వ వైభవం తెచ్చారన్నారు. రెండు వేలకు పైగా జబ్బులను ఆరోగ్య శ్రీ పథకంలో చేర్చి ఉచిత వైద్యమందిస్తున్నారని గుర్తు చేశారు. కరోనాను సైతం ఆరోగ్యశ్రీలో చేర్చిన ఏకైక ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అని కొనియాడారు. ప్రజలకు మంచి చేయటమే ధ్యేయంగా పని చేస్తున్న ప్రభుత్వానికి అండగా ఉండి ఆశీర్వదించాలని కోరారు. కుల, మత, రాజకీయాలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందించడంలో వలంటీర్లు ముఖ్య భూమిక పోషిస్తున్నారన్నారు. సంక్షేమ పథకాల అమలు, రూపాయి లంచం లేకుండా నేరుగా అర్హులకే చేరే విధానం దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాయన్నారు. అన్నివర్గాల వారికి మంచి చేస్తూ వస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి అందరి గుండెల్లో కొలువై ఉన్నాడన్నారు. ప్రజలకు ఎలాంటి సమస్యలు ఎదురైనా వాలంటీర్ల ద్వారా అధికారుల దృష్టికి తీసుకొస్తే, సమస్యను పరిశీలించి పరిష్కరిస్తారని తెలిపారు. ఎంపీడీఓ షబ్బీర్ అహ్మద్, తహసీల్దార్ ఫిరోజ్‌ఖాన్, ఈఓ ఉదయ్ కుమార్, నాయకులు చింతల శివానంద రెడ్డి, నీళ్లభాస్కర్, కేశవ రెడ్డి, శ్రీధర్ రాయల్, రఘు, రాయుడు, ఆనంద, రవి, రమేష్, షాహెద్, మస్తాన్, సైపుల్లా, సాధిక్, మహబూబ్ బాషా, రాజేష్, ముని, రాజబాబు పాల్గొన్నారు.



సమస్యలను అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి

ప్రైవేట్‌బస్సు యజమానులపై చర్యలు తీసుకోవాలి

మదనపల్లె : పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకుని అతివేగంగా బస్సులు నడుపుతూ ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్న ప్రైవేట్ బస్సు యజమానులపై చర్యలు తీసుకోవాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ..బెంగళూరు నుంచి తిరుపతి వెళుతున్న భారతీ మోటార్ ప్రైవేట్ బస్సు అతివేగంతో ప్రయాణిస్తూ కారును ఢీకొట్టి అదుపుతప్పి గురువారం వేంపల్లె పంచాయతీలో బోల్తా పడింది. ప్రయాణికులు తీవ్రగాయాల పాలయ్యారన్నారు. అంతరాష్ట్ర బస్సులను పర్యవేక్షించడంలో స్థానిక ఆర్టీఏ అధికారులు విఫలమయ్యారన్నారు. ప్రైవేట్ బస్సు యజమానులు రవాణాశాఖ నిబంధనలకు నీళ్ల వదలి ఇష్టానుసారంగా బస్సులు నడుపుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. ప్రజల అవసరాలకు సరిపడా ఆర్టీసీ బస్సులు లేని కారణంగానే ప్రైవేట్ బస్సులను ఆశ్రయించాల్సి వస్తోందన్నారు. ఆర్టీసీ అధికారులు ఈ విషయంలో చొరవ చూపి ప్రజల అవసరాలకు అనుగుణంగా ఆర్టీసీ బస్సులు నడపాలని కోరారు.

క్లుప్తంగా

నేడు వాహనాల వేలం

ములకలచెరువు: మండల కేంద్రంలోని ఎస్ఈబీ కార్యాలయం ఆవరణంలో శనివారం వాహనాలకు వేలం నిర్వహిస్తున్నట్లు సీఐ మల్లిక శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వివిధ కేసుల్లో పట్టుబడిన మూడు కార్లు, ఐదు ద్విచక్ర వాహనాలను వేలం నిర్వహిస్తున్నట్లు సీఐ పేర్కొన్నారు.

ముదివేడు ఎస్ఐగా ముబిన్‌తాజ్



కురబలకోట: ముదివేడు ఎస్ఐగా ఎస్. ముబిన్ తాజ్ నియమితులయ్యారు. స్టేషన్ చరిత్రలో ఈమె తొలి మహిళా ఎస్ఐ కావడం విశేషం. నంద్యాల జిల్లా కొత్తపల్లె నుంచి ఇక్కడికి బదిలీ అయ్యారు. రెండు రోజుల్లో బాధ్యతలు చేపట్టనున్నట్లు ఎస్ఐ తెలిపారు. ఇక్కడున్న ఎస్ఐ సుకుమార్ సెలవులో ఉన్నారు.

బహిరంగ వేలం వాయిదా

కలికిరి: స్థానిక మండల పరిషత్ కార్యాలయ కాంప్లెక్స్ అద్దెగదుల బహిరంగ వేలం శనివారం జరగాల్సి ఉండగా ఎంపీపీ నూర్జహాన్ ఆదేశాల మేరకు తాత్కాలికంగా వాయిదా వేసినట్లు ఎంపీడీఓ గంగయ్య తెలిపారు. తదుపరి బహిరంగ వేలం తేదీని త్వరలో ప్రకటించనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

రీసర్వేకు రైతులు సహకరించాలి

పెద్దతిప్పసముద్రం: వైఎస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు, భూరక్ష పథకంలో భాగంగా మండలంలో జరుగుతున్న రీసర్వేకు రైతులందరూ అధికారులకు సహకరించాలని తహసీల్దార్ విద్యాసాగర్ సూచించారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ పీటీఎం రెవెన్యూ గ్రామాల్లో రీసర్వే జరుగుతోందన్నారు. భూములు కలిగిన రైతులు వాటి హక్కు పత్రాలు, సమగ్రమైన రికార్డులు, భూమి సంక్రమించిన విధానం వివరాలను సర్వే టీం బృందానికి వివరించాలని సూచించారు.

కలికిరి: భూ పట్టాదారులు భూ రీ సర్వే సిబ్బందికి సహకరించాలని తహసీల్దారు భాగ్యలత ఒక ప్రకటనలో కోరారు. మండలంలోని కలికిరి, కొర్లకుంట, గుండ్లూరు, గుట్టపాళెం, మేడికుర్తి, మునెళ్ళపల్లి రెవెన్యూ గ్రామాల్లో భూ రీసర్వే జరుగుతోందని, రైతులు భూమి పుస్తకం, ఆధార్ కార్డు నకలు, బ్యాంక్ పాసుపుస్తకం, ఫోటోతో భూమి వద్ద ఉండి రీ సర్వే సిబ్బందికి భూమి హద్దులు చూపాలన్నారు. ప్రతి భూ పట్టాదారు ఇందుకు సహకరించాలని కోరారు.

గ్యాస్ లీకై విద్యార్థికి తీవ్ర గాయాలు

మదనపల్లె : స్టవ్ రిపేరీ దుకాణంలో గ్యాస్ లీక్ అయి మంటలు అంటుకుని విద్యార్థి తీవ్రంగా గాయపడిన సంఘటన శుక్రవారం రాత్రి మదనపల్లె పట్టణంలో జరిగింది. చలపతిరావుకాలనీలో నివాసమున్న హైదర్‌సాబ్ కుమారుడు షేక్ సమీర్ (14) స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్‌లో 9వ తరగతి చదువుతున్నాడు. సెలవులు కావడంతో చలపతిరావుకాలనీలో ఉన్న స్టవ్ రిపేరీ దుకాణానికి పనికి వెళ్లాడు. స్టవ్ రిపేరీ చేస్తున్న సమయంలో గ్యాస్‌లీక్ అయి ప్రమాదవశాత్తు మంటలు అంటుకున్నాయి. ప్రమాదంలో విద్యార్థి కాళ్లకు తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే బాధితున్ని స్థానిక ప్రభుత్వ జిల్లా ఆసుపత్రికి తరలించారు.

క్రిష్ణమూర్తికి కల్లూరి సుబ్బారావు అవార్డు

మదనపల్లె సిటీ: సాహితీరంగంలో విశేష సేవలు అందించినందుకు అనంతపురానికికు చెందిన ప్రముఖ రచయిత, పద్మశ్రీ కల్లూరి సుబ్బారావు జయంతిని పురస్కరించుకుని మదనపల్లెకు చెందిన ప్రముఖ నవలా రచయిత టీ.ఎస్.ఎ.క్రిష్ణమూర్తి అవార్డును అందుకున్నారు. అనంతపురం లలిత కళాపరిత్‌లో జరిగిన కార్యక్రమంలో నిర్వాహకులు పద్మజ అందజేశారు. శాలువ కప్పి మెమెంటోను అందజేశారు. ఆయనకు అవార్డు రావడం పట్ల ప్రముఖ కవులు, రచయితలు అభినందలు తెలిపారు.

వలంటీర్ల సేవలకు రివార్డులు

తంబళ్లపల్లె: ప్రభుత్వం ప్రతి ఏడాది గ్రామ వలంటీర్ల సేవలను గుర్తించి ప్రకటించిన సేవా వజ్ర, సేవారత్న, సేవామిత్ర రివార్డులకు ఎంపిక ప్రక్రియ పూర్తి అయింది. గుండ్లపల్లె పంచాయతీలో కె.నాగరత్న సేవారత్న రివార్డును దక్కించుకుంది. చెలూరివాండ్లపల్లె, గుండ్లపల్లె, కుక్కరాజుపల్లె, తంబళ్లపల్లె గ్రామ వలంటీర్లు ఐదుగురు సేవారత్న రివార్డును దక్కించుకున్నారు. మిగిలిన 178 మంది వలంటీర్లకు సేవామిత్ర రివార్డులు దక్కించుకున్నట్లు ఎంపీడీవో ఆనంద్‌కుమార్ తెలిపారు. త్వరలో ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి చేతుల మీదుగా సన్మానంతో పాటు రివార్డులు అందజేనున్నట్లు తెలిపారు.

పాలవ్యాన్‌ను ఢీకొన్న కారు

మదనపల్లె : పాలవ్యాన్‌ను కారు ఢీకొంది. ప్రమాదంలో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడిన సంఘటన శుక్రవారం రాత్రి మదనపల్లె మండలంలో చోటు చేసుకుంది. పట్టణంలోని నిమ్మనపల్లె సర్కిల్‌కు చెందిన ఎస్.జగదీష్ (35) రాత్రి కారులో పుంగనూరు వైపు వెళ్తున్న పాలవ్యాన్‌ను వెనుకవైపు నుంచి ఢీకొన్నాడు. ప్రమాదంలో కారు ముందుభాగం దెబ్బతినగా, కారు నడుపుతున్న జగదీష్ తీవ్రంగా గాయపడ్డాడు.

సమష్టి కృషితో మండలాభివృద్ధి సాధ్యం

కలికిరి: ప్రజాప్రతినిధులు, అధికారుల సమష్టి కృషితోనే మండల అభివృద్ధి సాధ్యమవుతుందని ఎంపీపీ నూర్జహాన్ అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఎంపీపీ అధ్యక్షతన మండల సాదారణ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శాఖల వారిగా అధికారులు ప్రభుత్వ పథకాలు, అభివృద్ధి నివేదికలను వివరించారు. ఎంఈఓ రంగనాథ రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం విద్యాశాఖ పరంగా అమలు చేస్తున్న పథకాలతో ప్రభుత్వ పాఠశాలలు విద్యార్థులకు తల్లిదండ్రుల పాత్ర పోషిస్తున్నాయన్నారు.పాఠశాలలో చేరినప్పటి నుంచి పుస్తకాలు, యూనిఫాం, బ్యాగ్, షూలు, నాణ్యమైన విద్యావిధానం, ఉత్తమ ఫలితాలు రాబట్టడం వరకు, నాడు–నేడుతో ప్రభుత్వ పాఠశాలలు కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా తయారయ్యాయన్నారు. మండలంలో 29 పాఠశాలలు, రెండు జూనియర్ కళాశాలలో నాడు–నేడు పథకంలో అభివృద్ధి జరుగుతున్నాయని తెలిపారు. మండలంలో జగనన్న కాలని ఇండ్లకు ఉచితంగా మీటరు ఇస్తున్నామని, లబ్ధిదారులు సద్వినియోగం చేసుకునేలా ప్రజాప్రతినిధులు చొరవ తీసుకోవాలన్నారు. వ్యవసాయ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లకు దరఖాస్తు చేసుకున్న వారికి నెల రోజుల్లో కనెక్షన్ ఇస్తుట్లు ట్రాన్స్‌కో ఏఈ ముజీబుర్ రెహ్మాన్ తెలిపారు. మండలంలో తాగునీటి సమస్యకు ప్రథమ ప్రాధాన్యత ఇస్తున్నట్లు ఆర్‌డబ్ల్యూఎస్ ఇన్‌చార్జ్ ఏఈ చక్రపాణి అన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు పద్మజ, తహసీల్దారు భాగ్యలత, మండల కో–ఆప్షన్ సభ్యుడు రిజ్వానుల్లా, వైస్ ఎంపీపీ శ్రీకాంత్, హౌసింగ్ ఇన్‌చార్జ్ ఏఈ వెంకటేష్, ఏపీఓ సుజాత, మెడికల్ ఆఫీసర్ చిన్నరెడ్డెప్ప, ఇరిగేషన్ ఏఈ ధమరుకం, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీపీ నూర్జహాన్

సమస్యలు పరిష్కరించాలని వినతి

మదనపల్లె సిటీ: సచివాలయ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని గ్రామ,వార్డు సచివాలయ ఎంప్లాయీస్ అసోసియేషన్ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎస్ఆర్ రహమాన్ ఏపీ గవర్నమెంట్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ చైర్మన్ కాకర్ల వెంకటరామిరెడ్డికి వినతిపత్రం అందజేశారు. సచివాలయ ఉద్యోగుల బదిలీలు పాదర్శకంగా నిర్వహించాలని కోరారు.

సబ్సిడీ వేరుశనగ కాయలు సద్వినియోగం చేసుకోండి



సబ్సిడీ విత్తన కాయలను అందజేస్తున్న ఎంపీపీ ఈశ్వరమ్మ, జెడ్పీటీసీ గజ్జెల శృతి

కేవీపల్లె : ప్రభుత్వం సబ్సిడీతో అందిస్తున్న వేరుశనగ విత్తన కాయలు రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ ఈశ్వరమ్మ, జెడ్పీటీసీ గజ్జెల శృతి అన్నారు. శుక్రవారం కేవీపల్లె రైతుభరోసా కేంద్రం వద్ద వేరుశనగ విత్తనాలకు రిజిస్ట్రేషన్ కార్యక్రమం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం 40 శాతం రాయితీతో 30 కేజీల బ్యాగ్ రూ. 1773తో అందిస్తోందని తెలిపారు. ఏఓ శ్రావణి మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్‌లో రైతుల అవసరాల మేరకు మండలంలోని అన్ని ఆర్‌బీకే కేంద్రాల్లో వేరుశనగ విత్తనాలు అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. ప్రస్తుతం నారాయణి రకం విత్తనాలు అందుబాటులో ఉన్నాయని, కావాల్సిన రైతులు ఆర్‌కార్డు, భూమి పాస్‌బుక్, మొబైల్ నెంబరుతో ఆన్‌లైన్‌లో పేరు నమోదు చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ వెంకటరమణారెడ్డి, ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ కారపాకల భాస్కర్‌నాయుడు, మండల కోఆప్షన్ సభ్యుడు సైపుల్లాఖాన్, నాయకులు పి. ద్వారకనాథరెడ్డి, మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనం అదుపుతప్పి వ్యక్తికి గాయాలు

మదనపల్లె : ద్విచక్ర వాహనం అదుపుతప్పి చేనేత కార్మికుడికితీవ్ర గాయాలయ్యాయి. మదనపల్లె పట్టణంలోని వీవర్స్‌కాలనీకి చెందిన రెడ్డెప్ప (49) చేనేత కార్మికునిగా పని చేస్తూ జీవిస్తున్నాడు. వ్యక్తిగత పనులపై ద్విచక్రవాహనంలో తంబళ్లపల్లెకు వెళ్లాడు. రాత్రి తిరిగి వస్తుండగా మార్గమధ్యంలో రెడ్డికోట వద్ద ఎదురుగా వస్తున్న వాహనానికి దారి ఇవ్వబోయి ద్విచక్రవాహనం అదుపుతప్పి కిందపడ్డాడు. ప్రమాదంలో బాధితుడు తీవ్రంగా గాయపడగా స్థానికులు 108 వాహనంలో మదనపల్లె ప్రభుత్వాసుపత్రికి తరలించారు. తంబళ్లపల్లె పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఊపందుకున్న ఉపాధిహామీ పనులు

తంబళ్లపల్లె: మండలంలో ఉపాధిహామీ పనులు ఊపందుకున్నాయి. శుక్రవారం 3974 మంది కూలీలు సుమారు 100 పనులలో పాల్గొన్నారు. రైతుకు ఉపయోగకరమైన పనులకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు ఏపీఓ రామన్న తెలిపారు. ఊటకుంటల నిర్మాణం, చెరువులకు సప్లైచానల్ పనుల ఏర్పాటు, అటవీప్రాంతంలో ట్రెంచ్‌ల నిర్మాణ పనులు జరుగుతున్నట్లు తెలిపారు. అత్యధికంగా బాలిరెడ్డిగారిపల్లె పంచాయతీలో రోజువారి 409 మంది కూలీలు కోసువారిపల్లెలో 400, గోపిదిన్నె 315 గుండ్లపల్లెలో 350 మంది కూలీలు పనులు పాల్గొనగా వారికి రూ.260 నుండి రూ.270లు గిట్టుబాటు కావడంతో పనులు చేసేందుకు ఆసక్తి చూపుతున్నారు.

ఈఎస్ఐని బలోపేతం చేయాలని డిమాండ్

మదనపల్లె : కార్మికుల ఆరోగ్యభద్రత, ఆస్పత్రి, మందులు, పెన్షన్లు, సిక్ వేతనాలు, నిరుద్యోగభృతి తదితర సౌకర్యాలు కల్పించే ఎంప్లాయీస్ స్టేట్ ఇన్సూరెన్స్(ఈఎస్ఐ)ను బలోపేతం చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు పి.శ్రీనివాసులు, కార్యదర్శి డి.ప్రభాకరరెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం పట్టణంలోని సొసైటీకాలనీ ఈఎస్ఐ డిస్పెన్సరీ ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాసులు మాట్లాడుతూ.. ఈఎస్ఐ డిస్పెన్సరీలో మందుల కొరత నివారించాలని, జిల్లాలో 30 పడకల ఈఎస్ఐ ఆస్పత్రిని ఏర్పాటు చేయాలని పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉద్దేశపూర్వకంగానే ఈఎస్ఐని నీరుగారుస్తున్నాయని విమర్శించారు. దేశమంతటా ఈఎస్ఐని 2022 కల్లా విస్తరించాలని నిర్ణయం తీసుకున్నప్పటికీ ఎక్కడా అమలుకాకపోవడం శోచనీయమన్నారు. ఈఎస్ఐ ఆస్పత్రులు డాక్టర్లు, పరికరాలు, సిబ్బంది, మందుల కొరతతో ఇబ్బందులు పడుతున్నాయన్నారు. కార్మికుల కంట్రిబ్యూషన్ డబ్బులు రూ. లక్షా 10 వేల కోట్లు రిజర్వు నిధులుగా ఉన్నప్పటికీ కేంద్రప్రభుత్వం తగినవిధంగా స్కీమును బలోపేతం చేయడానికి బదులుగా ఈఎస్ఐని ప్రైవేటీకరించాలని ప్రయత్నిస్తోందన్నారు. ప్రతి 20వేల మంది చందాదారులకు అందుబాటులో ఉండేలా ఈఎస్ఐ ఆస్పత్రులు ఏర్పాటు చేయాలన్నారు. అనంతరం ఈఎస్ఐ డిస్పెన్సరీ డాక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ మండలకార్యదర్శి గంగాదేవి, నాయకులు గోపాల్, రెడ్డిప్రసాద్, రమణ, కార్తీక్, రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.



ఈఎస్ఐ డిస్పెన్సరీ ఎదుట ధర్నా చేస్తున్న సీఐటీయూ నాయకులు

షాదీమహల్ నిర్మాణ పనులు ప్రారంభం

పీలేరు : స్థానిక తిరుపతి రోడ్డు మార్గంలో షాదీమహల్ నిర్మాణ పనులు శుక్రవారం ప్రారంభించారు. శుక్రవారం మాజీ ఎమ్మెల్యే జి.వి. శ్రీనాథరెడ్డి, సర్పంచ్ డాక్టర్ హబీబ్‌బాషా ఆధ్వర్యంలో పలువురు ముస్లిం మైనారిటీ నాయకులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే జి.వి. శ్రీనాథరెడ్డి మాట్లాడుతూ ఎంపీ మిథున్‌రెడ్డి సొంత నిధులు రూ. 50 లక్షలతో షాదీమహల్ మొదటి దశ నిర్మాణ పనులు చేపట్టడం అభినందనీయమన్నారు. మైనారిటీల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ముస్లిం మైనారిటీ నాయకులు హుమయూన్, గడిబాషా, జిలానీ, రెడ్డిబాషా, కాలేషా, అబ్దుల్ కలీమ్, డీఈఈ కరీముల్లా తదితరులు పాల్గొన్నారు.



షాదీమహల్ నిర్మాణ స్థలం వద్ద ప్రార్థనలు చేస్తున్న నాయకులు

రక్తహీనత నివారణకు ప్రభుత్వం కృషి

పీలేరు : గర్భిణులు, కౌమారదశ ఆడపిల్లల్లో రక్తహీనత నివారణకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు డాక్టర్ రమేష్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం మండలంలోని తలపుల పీహెచ్‌సీలో రక్తహీనత పరీక్షా పద్ధతిపై ఏఎన్ఎంలకు, సీహెచ్‌వో, ఎంఎల్‌హెచ్‌పీలకు ఒక్క రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్య, విద్య, స్త్రీ శిశు సంక్షేమ శాఖల సమన్వయంతో క్షేత్రస్థాయిలో నిర్వహించే రక్తహీనత నిర్మూలన చర్యల్లో సహలీస్ హిమోగ్లోబిన్ నిర్ధారణ పద్ధతి చాలా ప్రయోజనం అని తెలిపారు. సంపూర్ణ పోషణ, ఐరన్ పోలిక్ మాత్రలతో రక్తహీనతను నిర్మూలించవచ్చునని చెప్పారు. కార్యక్రమంలో పీహెచ్ఎన్ వెంకటసుబ్బమ్మ, పర్యవేక్షకులు కృష్ణయ్య, కుసుమ తదితరులు పాల్గొన్నారు.



రక్తహీనత పరీక్షపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

అభివృద్ధికి సమష్టి కృషి అవసరం

కేవీపల్లె : మండలాభివృద్ధికి సమష్టి కృషి అవసరమని ఎంపీడీఓ లతీఫ్ ఖాన్ అన్నారు. శుక్రవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల అధికారులు, స్థానిక ప్రజా ప్రతినిధులు సమన్వయంతో గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. గ్రామాల్లోని సమస్యలు గుర్తించి పరిష్కారించాలన్నారు. మండలంలో జరిగిన ప్రగతి గురించి శాఖల వారీగా చదివి వినిపించారు. ఇదిలా ఉండగా పలువురు సభ్యులు గైర్హాజరు కావడంతో మండల సమావేశం తూతూమంత్రంగా సాగింది. కార్యక్రమంలో ఎంపీపీ ఈశ్వరమ్మ, జెడ్పీటీసీ గజ్జెల శృతి, వైస్ ఎంపీపీలు వెంకటరమణారెడ్డి, హరిబాబు, ఏఎంసీ చైర్మన్ యల్లయ్య తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీడీఓ లతీఫ్‌ఖాన్

పార్లమెంటు భవనాన్ని రాష్ట్రపతితో ప్రారంభించాలి

మదనపల్లె : దేశ ప్రథమ పౌరురాలు, రాజ్యాంగాధినేత, రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము చేతుల మీదుగానే నూతన పార్లమెంటు భవనాన్ని ప్రారంభించాలని విడుదలై చిరుతైగల్ కట్చి(వీసీకే పార్టీ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పీటీఎం.శివప్రసాద్ డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక వీసీకే కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గిరిజన మహిళా రాష్ట్రపతిని అవమానిస్తూ ప్రధాని మోదీనే నూతన పార్లమెంటు భవనాన్ని ప్రారంభించనున్న నేపథ్యంలో 20 విపక్షపార్టీలతో కలిసి వీసీకే పార్టీ ప్రారంభోత్సవాన్ని బహిష్కరిస్తున్నట్లు ప్రకటించిందన్నారు. నూతన పార్లమెంటు భవనానికి అంబేడ్కర్ పేరు పెట్టాలని దేశప్రజలు పెద్ద ఎత్తున డిమాండ్ చేస్తున్నప్పటికీ ప్రధాని ఏమాత్రం పట్టించుకోకపోవడాన్ని ఖండిస్తున్నామన్నారు. పార్లమెంటు ప్రారంభోత్సవ తేదీని మార్చుచేసి, రాష్ట్రపతి చేతుల మీదుగా ప్రారంభించాలన్నారు. సమావేశంలో ముత్యాలమోహన్, జి.వి.రమణ, సొన్నికంటిరెడ్డెప్ప, పెద్దపాలెం రవిశంకర్, రాయల్‌సూర్య, బురుజుజనార్ధన్, గెరివిమల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

వందశాతం లక్ష్య సాధనకు కృషి చేయండి

పెద్దతిప్పసముద్రం/ ములకలచెరువు: జాతీయ ఆరోగ్య కార్యక్రమాలలో వైద్య సిబ్బంది వందశాతం లక్ష్య సాధనకు కృషి చేయాలని అన్నమయ్య జిల్లా ఎన్‌సీడీ నోడల్ అధికారి (అసంక్రమిత వ్యాధుల) డాక్టర్ శేషగిరి బాబు సూచించారు. శుక్రవారం ఆయన పెద్దతిప్పసముద్రం, ములకలచెరువులోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. జాతీయ ఆరోగ్య మిషన్ కార్యక్రమం అమలులో భాగంగా వైద్య సిబ్బందితో సమీక్షించారు. సీడీ సర్వే, ఆరోగ్యశ్రీ ఏఎన్ఎంల పని తీరు, అనీమియా ముక్తభారత్, గ్రామ పారిశుధ్య పోషణ, జన ఆరోగ్య సమితి ఖాతాలపై ఆరా తీశారు. వేసవిలో ఎండలు అధికంగా ఉండటంతో వడదెబ్బ, అతిసారా కేసులు వచ్చే అవకాశాలు ఉంటాయన్నారు. అవసరమైన మేరకు సెలైన్ బాటిళ్ళు అందుబాటులో నిల్వ ఉంచుకోవాలన్నారు. గ్రామ సచివాలయం, అంగన్‌వాడీ కేంద్రాలు, వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లతో పాటు వలంటీర్ల వద్ద కూడా ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. అనంతరం ఆసుపత్రిలో సౌకర్యాలు, మందుల కొరతపై ఆరా తీసి ప్రభుత్వ ఆసుపత్రుల్లో కాన్పుల సంఖ్య పెంచాలన్నారు. డాక్టర్లు పురుషోత్తం నాయక్, యస్దాని, జాహ్నవితో పాటు సీహెచ్‌వోలు, హెల్త్ ఎడ్యుకేటర్లు పాల్గొన్నారు.



పెద్దతిప్పసముద్రం వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న నోడల్ అధికారి శేషగిరి బాబు

అంతర పంటల సాగుతో అధిక ఆదాయం

వాల్మీకిపురం: ప్రధాన పంటల సాగుతో పాటు అంతర పంటల సాగుతో అధిక ఆదాయం సాధ్యమని జిల్లా ప్రాజెక్టు మేనేజర్ యశోదమ్మ అన్నారు. శుక్రవారం మండలంలోని జర్రావారిపల్లిలో రైతులు సాగు చేస్తున్న ప్రకృతి వ్యవసాయ సాగును గురువారం పది మంది రాజస్థాన్ రాష్ట్రంకు చెందిన మహిళలు వచ్చి పరిశీలించారు. ఈ సందర్భంగా స్థానికంగా ప్రకృతి సాగును చేపట్టిన రైతులు మాట్లాడుతూ 360 రోజుల పాటు తక్కువ విస్తీర్ణంలో ఎక్కువ పంటలు సాగు చేయడంతో పాటు నిత్యం వచ్చిన దిగుబడులను మార్కెట్‌కు తరలించి మంచిగా ఆదాయం పొందుతున్నామని వివరించారు. అనంతరం యశోదమ్మ మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయంలో వచ్చే దిగుబడులకు మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉండడంతో పాటు అంతర్ పంటల సాగు వలన నిరంతరం ఆదాయం సాధ్యమవుతుందన్నారు. భూమిపైన జీవ వైవిధ్యం, భూమిలో పల రక రకాల వేరు వ్యవస్థ ద్వారా అనేక రకాల సూక్ష్మజీవులు ఉత్పన్నమవుతాయన్నారు. మొక్కకు కావాల్సిన పోషకాలు అందుతాయని సూచించారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది రెడ్డిబాషా, మునిరా, పెద్ద రెడ్డెయ్య, హేమలత, స్వాతి, రాజస్థాన్ రాష్ట్ర మహిళలు పాల్గొన్నారు.



ప్రకృతి వ్యవసాయ పంటను పరిశీలిస్తున్న రాజస్థాన్ మహిళలు

జగనన్న విద్యా కానుక కిట్లు మంజూరు

పెద్దతిప్పసముద్రం: ఈ ఏడాది విద్యా సంవత్సరం ఆరంభం కాక ముందే ప్రభుత్వం విద్యార్థులకు జగనన్న విద్యాకానుక కిట్లు మంజూరు చేసింది. మండలానికి మొదటి విడతలో 18,211 పాఠ్య పుస్తకాలు, 3,732 జతల యూనిఫాం, 3,732 బ్యాగులు, 2,747 బెల్టులు, 443 డిక్షనరీలు మంజూరైనట్లు ఎంఈఓ నారాయణ శుక్రవారం పేర్కొన్నారు. జూన్ 12న ప్రభుత్వ పాఠశాలలు తెరచుకుంటాయని ఆలోపు పూర్తి స్థాయిలో వస్తు సామగ్రి వస్తుందన్నారు. విద్యా సంవత్సరం ఆరంభానికి ముందే ఆయా పాఠశాలలకు విద్యాకానుక కిట్లను అందజేస్తామన్నారు. మంజూరైన కిట్లను మోడల్ స్కూల్‌లో భద్రపరిచామని ఎంఈఓ తెలిపారు.



జగనన్న విద్యా కానుక కిట్ల గదిని పరిశీలిస్తున్న ఎంఈఓ నారాయణ

ఆకట్టుకున్న హోమ్ ఎక్స్‌పో–2023

మదనపల్లె : పట్టణంలో తొలిసారిగా ఏర్పాటు చేసిన ప్రాపర్టీ, బిల్డింగ్ మెటీరియల్ ప్రదర్శన ప్రజలను ఆకట్టుకుంది. మదనపల్లె అసోసియేషన్ ఆఫ్ లైసెన్స్‌డ్ ఇంజనీర్స్ (మేల్) ఆధ్వర్యంలో స్థానిక ప్యారడైజ్ ఫంక్షన్ హాల్‌లో మూడురోజుల పాటు నిర్వహిస్తున్న ఎక్స్‌పో మొదటిరోజైన శుక్రవారం సందర్శకులతో కిటకిటలాడింది. భవననిర్మాణ రంగాలకు చెందిన పలువురు రియల్టర్లు, మేస్త్రీలు, కార్మికులు, ఇంజనీరింగ్ కళాశాలల విద్యార్థులు ఎక్స్‌పోను సందర్శించారు. ఈ సందర్భంగా మేల్ అసోసియేషన్ ప్రెసిడెంట్ జాకీర్‌హుస్సేన్, వైస్‌ప్రెసిడెంట్ మహేంద్రలు మాట్లాడుతూ... పెద్ద పెద్ద నగరాలకే పరిమితమైన హోమ్ ఎక్స్‌పోను మదనపల్లె ప్రజలకు అందుబాటులోకి తెచ్చామన్నారు. ఇందులో 40 స్టాల్స్‌లో భవన నిర్మాణరంగాలకు చెందిన సామగ్రి, పనిముట్లు, వివిధ కంపెనీల ఉత్పత్తులు, హౌసింగ్ ఫైనాన్స్ కంపెనీలు, సిమెంట్, హాలో బ్రిక్స్, వుడ్ మెటీరియల్ తయారీదారులు తమ ఉత్పత్తులను ప్రదర్శనకు ఉంచారన్నారు. సివిల్ ఇంజనీరింగ్ విద్యార్థులు అధికసంఖ్యలో పాల్గొని భవననిర్మాణ రంగానికి చెందిన నిపుణులతో సందేహాలు నివృత్తి చేసుకోవడం, నూతన ఆవిష్కరణల గురించి తెలుసుకోవడం జరిగిందన్నారు. శని, ఆదివారాలు రెండురోజుల పాటు జరిగే ఎక్స్‌పోను పట్టణ ప్రజలు ఆదరించాలని కోరారు.



హోమ్ ఎక్స్‌పో విశేషాలను వివరిస్తున్న లైసెన్స్‌డ్ ఇంజనీర్స్ సభ్యులు

నూతన పార్లమెంట్‌కు అంబేడ్కర్ పేరు పెట్టాలి

పీలేరు : నూతన పార్లమెంట్‌కు భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ పేరు పెట్టాలని మాల మహానాడు రాష్ట్ర ఉపాధ్యక్షులు ధరణికుమార్ కోరారు. శుక్రవారం పీలేరులో నిర్వహించిన మాలమహానాడు సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అవలంభిస్తున్న తీరు దేశ ప్రజల మనోభావాలను దెబ్బతీసే విధంగా ఉందన్నారు. ప్రపంచ దేశాలు మన రాజ్యాంగాన్ని గౌరవిస్తుంటే మన పాలకులు గౌరవించకపోవడం దురదృష్టకరమని పేర్కొన్నారు.